క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ఉలవపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

చేజర్ల: ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని బోడిపాడు, ఉలవపల్లి, కొట్టాలు, పుట్టుపల్లి, తిమ్మాయిపాళెం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలను చదవాలని ప్రచారం నిర్వహించారు. ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని, గ్రంథ పఠనం వల్ల జ్ఞానం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు పెంచలనరసయ్య, కొండయ్య, కృష్ణయ్య, గాయిత్రి, శేషాద్రి, మాధవ, పద్మమ్మ, నరసారెడ్డి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు సుబ్బరాయుడు షష్టి



సుబ్బరాయుడు స్వామి

వరికుంటపాడు: మండలంలోని పామూరుపల్లిలో కొలువైన సుబ్బరాయుడుస్వామి షష్టి మహోత్సవం సోమవారం జరుగుతుందని నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధాన, 108 లీటర్ల పాలతో పంచామృత అభిషేకాలు, పుష్పయాగం, గణపతి, రుద్ర, మూలమంత్ర హోమాలు జరుగుతాయన్నారు. రాత్రికి గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

పేదలకు చీరల పంపిణీ



ఆత్మకూరు టిడ్కో భవనాల వద్ద మహిళకు చీరలు అందజేస్తున్న పాస్టర్ స్టీఫెన్

ఆత్మకూరు: మరో వారం రోజుల్లో క్రిస్మస్ పండగ జరగనున్న నేపథ్యంలో రిలీఫ్ గోస్పెల్ చర్చి ఆధ్వర్యంలో పలువురు పేద మహిళలకు ఆదివారం పాస్టర్ స్టీఫెన్ చీరలు పంపిణీ చేశారు. కొన్నేళ్లుగా చర్చి తరపున పేద మహిళలకు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది టిడ్కో భవనాల్లో, నెల్లూరుపాళెం గిరిజన కాలనీలో పేద మహిళలకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సయోమన్ రమణయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రమీల

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరులో డాక్టర్ మాదమాల ప్రమీల ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మూడు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకూరు రామలింగారెడ్డి, కేతా సుబ్బారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి ప్రధాని కృషి



వికసిత్ సంకల్ప యాత్ర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూరురూరల్: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదలను అభివృద్ధి చేసేందుకు దేశ ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని ఆత్మకూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఆరవీడు, కరటంపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో పటిష్టమైన దేశంగా తయారు చేయడంలో ప్రధాని కృషి చేస్తున్నా రని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ నరసింహనాయుడు, ఆత్మకూరు రూరల్ మండల అధ్యక్షుడు వాసుపల్లి సుధాకర్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలనతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: దుష్టశక్తుల్లాంటి ప్రతిపక్ష పార్టీలు, పచ్చ మీడియాను ఎదురొడ్డుతూ.. మరో వైపు ఖాళీ ఖజానా నుంచి.. ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటూ ఒక్కడిగానే పేదల జీవితాల్లో వెలుగులు నింపిన పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని 13వ వార్డులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు వివరాలు తెలియజేసే బుక్‌లెట్స్‌ను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనకే ష్యూరిటీ, గ్యారెంటీ లేని చంద్రబాబు మనకు ష్యూరిటీ, గ్యారంటీ ఇస్తాడంట అని ఎద్దేవా చేశారు. పద్నాలుగేళ్ల తన పాలనలో ప్రజలకు ఏమీ చేయని చంద్రబాబు, గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి.. ఇప్పుడు ఏదో చేస్తానంటే మళ్లీ నమ్మితే నట్టేట మునిగినట్లేనన్నారు. నిన్ను నమ్మం బాబు అని ఆయనకు గట్టిగా చెప్పాలన్నారు. మన నమ్మకం జగనన్న అని తెలిపారు. తన పాదయాత్ర ద్వారా అందరి కష్టాలు విని, బాధలు చూసి ఒక్క అవకాశం నాకివ్వండి, మిమ్మల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానన్న జగనన్న, అధికారంలోకి రాగానే పేదలను పార్టీలకు అతీతంగా, కులాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఎంతో గుండె ధైర్యాన్నిచ్చారని ఎమ్మెల్యే వివరించారు. కలలో కూడా ఊహించని రీతిలో పేద ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా పేదల ఆత్మ గౌరవాన్ని పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. లబ్ధిదారులకు నేరుగా ఇంటి గడప దగ్గరే సంక్షేమ ఫలాలు అందిస్తున్న సుపరిపాలన చేస్తున్నారన్నారు. ఎల్లో మీడియా రాతలు నీచంగా ఉన్నాయని, పేద పిల్లలకు ట్యాబ్‌లిచ్చినా వారి కడుపులు మండిపోతున్నాయని, పేద బిడ్డల ఇంగ్లిష్ మీడియం చదువులు కూడా వారికి కంటగింపుగా ఉందన్నారు. జగనన్న చేస్తున్న మంచి పనులన్నీ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియాకు నచ్చట్లేదని, ప్రజలకు మేలు జరిగితే వారు సహించలేకున్నారని తెలిపారు. పేదలను చంద్రబాబు ఓటు బ్యాంకుగానే చూస్తారని, గుండెల్లో పెట్టుకుని చూసుకునే జగనన్న కావాలా? గడప బయటే నిలబెట్టే చంద్రబాబు కావాలా? అనేది ప్రజలు ఆలోచించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా మహిళలు అందరూ జగనన్నను గెలిపించుకోవాలని, ఆయన్ను వెన్ను తట్టి ముందుకు నడిపించాలని చెప్పారు. నీతిలేని వ్యక్తులే జగనన్న మీద అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల యుద్ధం పేద వారికి, పెత్తందార్లకు మధ్య జరుగుతుందన్నారు. పేదలు గెలవడమంటే జగనన్న గెలవాలని ప్రజలు గుర్తించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. జగనన్న పాలనలోనే పేదల బతుకుల్లో వెలుగులు విరజిమ్మాయని, చంద్రబాబును నమ్మితే మనం పూర్తిగా మునిగినట్టే అని, పేదలను చులకనగా చూసి, అవమానాల పాలు చేసిన వాడు చంద్రబాబు అని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, ఊతముక్కల బాల మురళిరెడ్డి, వేము ల చెన్నకేశవులునాయుడు, చక్రీ, మన్నెమాల శ్రీనివాసులురెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధతో 'పది' పరీక్షలు రాయండి

- విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్



మెరిట్ విద్యార్థులకు సాల్కర్‌షిప్, ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: వచ్చే ఏడాదిలో పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని శ్రద్ధగా పరీక్షలు రాయాలని, మంచి ఫలితాలు సాధించాలని నెల్లూరుకు చెందని కృష్ణచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పదో తరగతి విద్యార్థుల టాలెంట్‌ను గుర్తించేందుకు ప్రత్యేక పరీక్ష నిర్వహించారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ అందజేశారు. కృష్ణ చైతన్య సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సెయింట్‌మేరీస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సాల్కర్‌షిప్‌లు అందజేశారు. ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ ఏటా గ్రామీణ ప్రాంతాల్లో మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి వారి ఉజ్వల భవిష్యత్ కోసం ఇంటర్ తరగతుల్లో ఆర్థిక చేయూతనందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున, ప్రగతి స్కూల్ నిర్వాహకుడు రామ్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో రోగాలు మటుమాయం



ధ్యాన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న పిరమిడ్ మాస్టర్ రాఘవేంద్రరావు

ఆత్మకూరు: క్రమం తప్పకుండా ప్రతినిత్యం నిర్దేశిత సమయంలో ధ్యానం చేస్తుంటే రోగాలు దరిచేరవని, ఉన్న రోగాలకు దూరం అవుతాయని నాయుడుపేటకు చెందిన సీనియర్ పిరమిడ్ ధ్యాన మాస్టర్ రాఘవేంద్రరావు తెలిపారు. పట్టణంలోని షిరిడీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం ప్రత్యేక ధ్యాన తరగతులు నిర్వహించారు. మాస్టర్ రాఘవేంద్రరావు ధ్యానంతో కలిగే ప్రయోజనాలను, నిర్వహించాల్సిన విధానాన్ని వివరించారు. విద్యార్థులు సైతం చిన్న వయసు నుంచే ధ్యానంపై అవగాహన పెంచుకొని సాధన చేస్తే ఉజ్వల భవిష్యత్ కలుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు మనశ్శాంతిని, శారీరిక రుగ్మతలను పోగొట్టుకొనేందుకు ధ్యానం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

భారీ సంఖ్యలో శబరిమలకు తరలిన స్వాములు



శోభాయాత్రగా శబరిమలకు వెళ్తున్న మాలధారులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలో అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్న పలువురు మాలధారులు ఆదివారం పెద్ద సంఖ్యలో శబరిమలకు తరలివెళ్లారు. తొలుత స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు ఇరుముడులు ధరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆలయం కిటకిటలాడింది. పూజా కార్యక్రమాల అనంతరం స్వాములు భిక్ష స్వీకరించి అయ్యప్ప నామస్మరణతో శోభాయాత్రగా శబరిమలకు బయలుదేరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సోమశిల: అనంతసాగరంలోని ఈఎంసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం షకీనా సువార్త ప్రార్థనా మందిరంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈఎంసీ ఫౌండర్ పీ ఎడ్వర్డ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాపరి టీ సంపత్ కుమార్, బ్రదర్ విలియం కేసరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రీక్రిస్మస్ వేడుకలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఎస్‌వీ కన్వెన్షన్ హాలులో సోమవారం ఉదయం 11 గంటలకు యునైటెడ్ ప్రీక్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ సేవా సమితి చైర్మన్ కాకి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొనాలని కోరారు.

ప్రీ క్రిస్మస్ వేడుకలకు హాజరు కావాలి

కలిగిరి: వింజమూరులోని ఎస్వీ కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగే ప్రీ క్రిస్మస్ వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలకు మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిల పాస్టర్లు, మత పెద్దలు హాజరు కావాలని కోరారు.

ఎస్సైగా అనూష బాధ్యతల స్వీకరణ



అనూష

సీతారామపురం: ఎస్సైగా పత్తిపాటి అనూష ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కందలేరు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం నివారించేందుకు దృష్టి సారిస్తానని చెప్పారు.

పంచాయతీ ఈఓ బాధ్యతల స్వీకరణ



ఈఓను సన్మానిస్తున్న సర్పంచ్, తదితరులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ ఈఓగా బి.శ్రీనివాసులురెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న ఈఓ శ్రీనివాసులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలో పారిశుద్ధ్య అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెడతానన్నారు. అనంతరం సర్పంచ్ ఎస్. సుజన, స్థానిక సిబ్బంది ఈఓను శాలువాతో ఘనంగా సన్మానించారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందనను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం పది నుంచి అర్జీలను అందజేయాలన్నారు.

నవోదయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా మర్రిపాడు మండలం కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్య బోధించి తమను అత్యుత్తమ స్థాయికి చేర్చిన నవోదయ విద్యాలయమని, విద్యార్థి దశ నుంచే తమను ఉత్తమ విలువలు, నైపుణ్యం, దేశ భక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, పలు భాషల్లో తర్ఫీదునిచ్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. 2000 సంవత్సరం నుంచి పూర్వ విద్యార్థుల సమ్మేళనం కొనసాగుతుందని, రెండు రోజులుగా విద్యార్థుల సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ ఉత్సాహంగా సాగిందన్నారు. నవోదయ అలుమ్ని అసోసియేషన్ నెల్లూరు ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో విద్యార్థిని విద్యార్థులకు, బోధనా సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు.

పూర్వ విద్యార్థుల రోటిమేకర్ వితరణ

1993 నుంచి 2000 వరకు విద్యాలయంలో చదివిన పూర్వ విద్యార్థులు తమ ఉన్నతికి ఎంతో దోహదం చేసిన విద్యాలయానికి ఉడతా భక్తిగా రూ.3.50 లక్షల వ్యయంతో ఆటోమేటిక్ రోటిమేకర్ మెషిన్‌ను విరాళంగా అందజేయడం జరిగింది.

రాజరెడ్డితో కావలి డీఎస్పీ భేటీ



ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని కలిసిన కావలి డీఎస్పీ వెంకటరమణ

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఆదివారం మర్రిపాడు మండలం బ్రహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో కావలి డీఎస్పీ వెంకటరమణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను శాలువాతో సత్కరించి పూలమొక్కను అందజేశారు. సీతారామపురం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పత్తిపాటి అనూష మేకపాటి రాజగోపాల్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డు మరమ్మతు పనులు చేయిస్తున్న రఘునాథ్‌రెడ్డి

సంగం: సంగం ప్రధాన రహదారి కొంతకాలంగా గుంతలుగా ఉండడంతో ఆదివారం వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. రోడ్డు అస్తవ్యస్తంగా ఉన్న విషయాన్ని పలువురు రఘునాథ్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. ఆయన సూచనలతో ఆదివారం సొంత నిధులు వెచ్చించి మట్టి తోలి రోడ్డు మరమ్మతులు చేయించారు. దీంతో పలువురు రఘునాథ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగులకు ఘన సన్మానం



పలువురు విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: సుమారు మూడు దశాబ్దాలపైగా ప్రభుత్వ ఉద్యోగాలు నిర్వహించి విశ్రాంత దశలో ఉన్న పెన్షనర్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలని అసిస్టెంట్ ట్రెజరీ అధికారి అన్నారు. పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో ఆదివారం సాయంత్రం ప్రాంతీయ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే నిర్వహించారు. ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాలకు చెందిన పలువురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రామ్మూర్తి, మణిప్రసాద్, అన్నం నారయ్య, చాంద్‌బాషా, సాధిక్ హుస్సేన్, లక్కు ప్రసాద్, సుధాకర్‌రావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ మల్లెం కొండేశ్వరస్వామి వార్షికోత్సవాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని చుంచులూరులో కొలువైన అంకమ్మ మల్లెం కొండేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణం జరిగి సంవత్సరం పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉత్సవాలు నిర్వహించారు. వివిధ రకాల పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోరెం మల్లికార్జున, సాంబయ్య, కొండలరావు, ఇంద్ర మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోలాహలంగా నగరోత్సవం





నెల్లూరు(బృందావనం): నగరంలో జైనుల నగరోత్సవాన్ని కోలాహలంగా ఆదివారం నిర్వహించారు. కాకినాడకు చెందిన ప్రియాల్ వచ్చే ఏడాది మార్చి 3న సన్యాసాన్ని స్వీకరించనున్న నేపథ్యంలో నెల్లూరు విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. మండపాలవీధిలోని సుమతి శ్రేయన్స్ మందిరం నుంచి వివిధ ప్రాంతాల మీదుగా అక్కడి జైన మందిరానికి నగరోత్సవం చేరింది. మధ్యాహ్నం ప్రసాదాన్ని అందజేశారు. జైన ఆరాధన భవన్‌లో ప్రియాల్‌ను సత్కరించారు. సుమతి శ్రేయాన్స్ జైన్ సంగీత్, బాలికామండల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శనలను నిర్వహించారు. భోగిబాయి పూనంచంద్ లఖావత్, కైలాష్‌కుమార్ పూల్‌చంద్, కమలాబాయి ఘీసులాల, సంగీత సురేష్‌కుమార్, కవితా అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో అమరగాయకుడు ఘంటసాల జయంతి వేడుకలను శాంతి కల్చరల్స్ అధ్యక్షుడు అమానుల్లాఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. శాంతి ఆర్కెస్ట్రా ఈవెంట్స్ ఆధ్వర్యంలో సంగీత విభావరి.. రాజా డ్యాన్స్ స్టూడియో ప్రత్యేక నృత్యాలు.. కళానికేతన్ ఈవెంట్స్ నిర్వహించిన కోలాట ప్రదర్శన తదితరాలు ఆకట్టుకున్నాయి. సినీ గీతాలను సీనియర్ గాయకులు మధుసూదన్, రామచంద్రరావు, షఫీ, విజయలక్ష్మి, విమల, పావనీ దాస్ ఆలపించారు. అనంతరం నూర్‌బాషా సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేషాను సత్కరించారు. పాటలు, నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. నాట్యాచార్య రమణయ్య, చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధినేత రమేష్‌బాబు, పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, బుల్లితెర నటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, రియాజ్‌బాషా, కేతా సుబ్బారావు, అరవ రాయప్ప, పొంగూరు సుబ్బారెడ్డి, దోస్త్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. అభిషేకాలు, తదితరాలను జరిపారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ - 2 గ్రాండ్ టెస్ట్‌కు విశేష స్పందన

నెల్లూరు(మినీబైపాస్): గ్రూప్ – 2 మెగా గ్రాండ్ టెస్ట్‌ను జిల్లా ఉపాధి కార్యాలయం, సింహపురి ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పరీక్షకు 150 మందికిపైగా హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారికి రూ.మూడు వేలు, రూ.రెండు వేలు, రూ.వెయ్యిని అందజేశారు. వీరికి ఉచిత శిక్షణను ఇవ్వనున్నామని స్టడీ సర్కిల్ డైరెక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.